# ప్రమ్ మి విత్ లవ్

గోపి రవి



అప్పుడే తెలతెల వారుతోంది. రాధ లేచింది. లేస్తూనే "ఆహా ఈ జగమూ సుందరమయమూ" అని కూనిరాగం తీసింది. ఇవాళ రాధకి ఎక్కడ చూసినా వసంతమే కనిపిస్తోంది. రోడ్డుమీద పోయే వాహనాలు లేళ్ళగానూ, దూంకలుగానూ కనిపిస్తున్నాయి. పెరట్లో కొళాయి చప్పుడు జలపాతంలా వినిపిస్తోంది. మనసు ఉప్పొంగిపోతోంది రాధకి. ఏం చెయ్యాలో తోచడంలేదు. పక్కనే పడుకున్న గోపాలాన్ని చూసింది. "మా ఆయన ఎంత ముద్దొస్తున్నాడు" అనుకుంది రాధ. లేచి పాదాలకి నమస్కారం చేసింది. ఈ నమస్కారం బహుశా గోపాలం జీవితంలో మొదటిది కాబోలు. ఇటువంటి అదృష్టం మరిచూసే అవకాశంలేకుండా నిద్రపోతున్నాడు గోపాలం.

"ఎంచక్కని పాదాలు. ఏ కోమలి పాదాలుకూడా నా గోపాలంపాదాలకి సాటి రావు. అంత నాజూకైన పాదాలు గోపాలానివి. ఆ పాదాలని చూసేకదా తను ప్రేమించింది. ఆ పాదాల దగ్గర కొంచెం చోటు దొరికితే ఎంత బాగుండును అనుకునేది తను ఆ రోజుల్లో" అని ఆలోచిస్తోంది రాధ. ఇంతలో ఏదో జ్ఞాపకమొచ్చి ఇంకో నమస్కారం పెట్టేక లోపలికెళ్ళింది రాధ.

గోపాలం లేచిన చప్పుడు వినిపించింది రాధకి. పరిగెత్తుకొచ్చి జామ్మని ముద్దుపెట్టుకుంది. బిక్క చచ్చిపోయాడు గోపాలం. మొహం కడుక్కోకుండా దగ్గరకి రాని వ్యని ఆ రాధే ఈ రాధ అనుకున్నాడు. ఏంచెయ్యాలో తోచక చిరునవ్వునవ్వి పెరట్లోకి నడిచేడు. రాధ వంటింట్లో కెళ్ళింది. గిన్నెకి నీళ్ళుపడేసి చూపుడువేలు బుగ్గకానుక్కు కూర్చుంది రాధ. నీళ్ళు మరుగుతున్న చప్పుడు ఎంతో హాయిగావుంది రాధకి. "గోపాలం" అని మనసారా అనుకుంది రాధ "ఆయన గోపాలుడైతే తను రాధ, ఆయన దుష్యంతుడైతే తను శకుంతల. ఆయన రాముడైతే తను సీత. ఈ రోజు ఎంత హాయిగావుంది" అనుకుంది రాధ.

"ఓ ఏక్ బార్ ఆతా హై దిన్ ఐసా రోజ్ నహీ" అని పాడుకుంటూ కాఫీ కలపసాగింది. ఇంతలో గోపాలం వచ్చి తలుపుకి ఆనుకుని నుంచున్నాడు. కాఫీ కలిపి వెనక్కి తిరిగింది రాధ.

"ఎప్పుడొచ్చావోయ్" అంది. ప్రేమ మరీ కట్టలు తెంచుకుంటే ఏకవచన ప్రయోగం చేస్తుంది రాధ. "ఎప్పుడొస్తే ఏం కానీ. నువ్వు ఆ తెల్లచీరతో కూర్చుని కాఫీ కలుపుతూంటే ఎవరు జ్ఞాపకమొస్తున్నారో తెలుసా?" అన్నాడు గోపాలం. "ఎవరేం?" అంది రాధ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ.

"మా అమ్మమ్మ" అన్నాడు గోపాలం నవ్వుతూ. "మరే పాపం. మీ నెరసిన జుట్టు చూస్తూంటే మా తాత జ్ఞాపకమొస్తున్నాడు" అంది రాధ. "నా జుట్టు నేం వెక్కిరించక్కర్లేదు గానీ. ఈ సారి మీ అన్నయ్య దగ్గర నుంచీ ఓ లీటరు నల్లరంగు తీసుకురా. వారానికి ఓ కిరవనాయిలు డబ్బాడు రంగు వాడతాడుగా" అన్నాడు గోపాలం. "మా అన్నయ్యనేం దెప్పనక్కర్లా" అంది రాధ. సీరియస్‌గా పకాలుమని నవ్వేశాడు గోపాలం. రాధ ఉడుక్కుంది. రాధ బుగ్గమీద చిటికవేసి లేచాడు గోపాలం.

ఫ్రెష్అయి ఆఫీసుకి బయలు దేరేడు గోపాలం. వెనకాలవచ్చి భుజం మిద చెయ్యేసి తన వేపుకు తిపుకుని "మరచి పోరుకదూ" అంది గోముగా రాధ. "ఏవిటేః" అన్నాడు గోపాలం అమాయకంగా." ఛీః పోండి" అంది రాధ "మరి తెస్తారుకదూ అంది టై సవరిస్తూ. "సరే" అన్నాడు గోపాలం కన్నుకొట్టి "ఇక నడవండి బాబూ. మీరిక్కడుంటే లాభం లేదు" అని గోపాలాన్ని ఆఫీసుకి పంపింది రాధ.

మధ్యాహ్నమయింది "ఇవాళనుంచి తనకు బోలెడు ఖాళీ. పెయింటింగు, ఎంబ్రాయిడరీ, ఫాబ్రిక్ పెయింటింగు ఎన్నో చేసుకోవచ్చు కవిత్వం రాయాలని ఎన్నాళ్ళనుంచో ఉంది, ఇంక రాయడానికి బోల్డు టైము" పడుకుని ఆలోచిస్తోంది రాధ.

ఇంతలో తలుపుకొట్టిన చప్పుడు వినిపించింది. పరిగెత్తుకెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా ఓ పాకేజీ పట్టుకు నించున్నాడు ప్యూను. అదిలోపల పెట్టమని వాడిని పంపేసింది రాధ.

"మెతో హర్ మోడ్ వర్ తుజ్‌కో ఢూండా సదా" అని పాడుకుంటూ పాకేజీ విప్పింది. విప్పంగానేదాన్లో "టు యు విత్ లవ్. గోపాల్" అని రాసుంది ఓ చీటీమిద "హాయ్ మై డార్లింగ్" అని దాన్ని ముద్దు పెట్టుకుంది రాధ. గదంతా సర్ది, నల్లంచు తెల్లచీర కట్టుకుని వచ్చి కూర్చుంది. "గోపాలానికి ఎందుకో తెల్లరంగంటే అంత ఇష్టం" అనుకుంది రాధ.

గోపాలం కోసం ఎదురుచూస్తూ కూర్చుంది రాధ. "ఏవిటో ఎంతకీ రారు" అని గదిలో పచార్లు ప్రారంభించింది. ఎందుకో తన ఆత్రుతకి తనే సిగ్గుపడింది. ఆ క్షణం రాధ మనసులో ఏవో భావాలు మెదిలాయి.

ఓ కాగితం, పెన్ను తీసుకుని రాయడం ప్రారంభించింది:

"ఎందుబోయితివి నా రాజా
నీ వెందు దాగితివి నా ప్రభూ,
ఏ కాంత చెంత కేగితివోయీ
నన్నేకాంతమున వదలి,
నీ కోసము నేను విహంగమునై
వినువీధులెల్ల వెదకితిరా."

ఇలా రాస్తూండే సరికి తలుపు చప్పుడు వినిపించింది. వెంటనే దాన్ని దాచేసి తలుపు తీసింది రాధ. ఎదురుగా గోపాలం కనిపించేడు."ఇంత ఆలస్యం ఎందుకయిందిః" అడిగింది రాధ. "నా పర్సనల్ సెక్రట్రీ వదల్లేదు" అన్నాడు గోపాలం. "మరే పాపం. అక్కడే ఉండలేక పోయారా" అంది రాధ దీర్ఘంతీస్తూ. "ఉందును కానీ సినిమాకి వెళ్దావని వచ్చేను. త్వరగా తెములు" అన్నాడు గోపాలం. "ఎం? మీ పి. ఎ. రానందాః" అడిగింది రాధ "తను రేపొస్తానంది" అన్నాడు గోపాలం కామ్‌గా. రాధ రుసరుస లాడుతూ లోపలి కెళ్ళింది.

"రాధా. వంట వండేయ్ పోదాం" అన్నాడుగోపాలం "ఇప్పుడుకాదు వచ్చిన తరువాత వండుతాను" అందిరాధ ఇద్దరూ బయలుదేరారు దారిలో తను రాసిన గీతం గురించి గోపాలానికి చెప్పాలని ఎంతో ఇదిగావుంది రాధకి. కానీ ఎక్కడా ఛాన్సు దొరకలేదు. గోపాలం తిండిగురించి ఆలోచిస్తున్నాడు. రాధ పద్యం గురించి ఆలోచిస్తోంది.

సినిమాచూసి బయలుదేరేరు ఇద్దరూ. "రాధా. వంట ఎంతసేపు పడుతుందంటావ్?" అడిగేడు గోపాలం. "మీకెప్పుడూ తిండిధ్యాస తప్పితే. ఓ పాటనీ. పద్యమనీ ఏవీ పట్టవుకదా" అంది రాధ. తన తిండికి. సాహిత్యానికి సంబంధమేమిటో తెలీలేదు గోపాలానికి. ఇద్దరూ ఇల్లు చేరుకున్నారు.

రాధ మొహం కడుక్కుని కొత్తగా కొన్న ప్రెషర్ కుక్కర బయటికి తీసింది. అది చూసి "హతోస్మి" అనుకున్నాడు గోపాలం. "నువ్వు దాంతో వండుతావని తెలిస్తే హోటల్లో భోంచేసి వచ్చేవాళ్ళంకదా" అన్నాడు గోపాలం. "పది నిమిషాల్లో వంట అయిపోతుంది చూస్తూండు" అంది రాధ ప్రేమగా, గోపాలం ఏమీ మాట్లాడలేదు.



వాహ్యాళి

ఫొటో: ఎ. ఆర్. రెడ్డి

బియ్యంనీళ్ళు సరిగ్గా కొలిచి ప్రెషర్ కుక్కర్‌లో వేసి పొయ్యి మీద పెట్టి గోపాలం ఎదురుగావచ్చి కూర్చుంది. "ఏవన్నా కబుర్లుచెప్పు గోపాలం" అంది రాధ గోపాలం జుట్టు సవరిస్తూ. 'ఇంకెంత సేపట్లో అవుతుంది వంటః' అడిగేడు గోపాలం. "ఒక్క పావుగంటమ్మా" అంది రాధ ముద్దుగా. "అయితే హాల్లో కూర్చుందాం రా" అంటూ రాధ భుజం మిద చెయ్యేసి తీసికెళ్ళాడు గోపాలం.

ఇదరూ "స్వీట్ నథింగ్స్" చెప్పుకుంటుంటే. వంటింట్లో నుంచి రైలింజనులా చప్పుడు వినిపించింది. ఉలిక్కిపడ్డాడు గోపాలం. "ఏవిటండీ మి భయంః ప్రెషర్ కుక్కరండీ ఆల్‌మోస్ట్ వంట అయిపోయినట్టే" అంది రాధ గోపాలం హృదయం మిద వాలిపోతూ. గోపాలానికి ప్రాణం ప్రాణంలోలేదు. "ఎందుకు కొన్నారా భగవంతుడాః" అనుకున్నాడు గోపాలం.

"లెండీ" అంటూ పరిగెత్తింది రాధ వంటింట్లోకి. ప్రెషర్ కుక్కర్‌ని అప్పుడే బయటికి విసిరేయాలన్నంత కోపం వచ్చింది గోపాలనికి. లేచి వెనకాలే వెళ్ళాడు గోపాలం. అప్పటికే రాధ ప్రెషర్ కుక్కర్ దింపేసి టెన్నింగ్ నార్కేలా నుంచుంది."ఎవ్విరిథింగ్ ఈజ్ రెడీ" అంది రాధ.

గోపాలం సీరియస్‌గా చెంబూ కంచం పట్టుకు బయలుదేరేడు డైనింగ్ టేబిలు దగ్గరకి. "ఆహా, అలాక్కాదు, మీకో సర్‌ప్రైజ్—ముందర మీరు బట్టలు మార్చుకురండి." గోపాలం వచ్చేసరికి డైనింగ్ టేబులంతా నీటుగా సర్ది ఉంది. ప్రెషర్ కుక్కర్ పక్కనే "ఫ్రమ్ మి విత్ లవ్, రాధ" అని చిన్నబోర్డు ఉంది.

కుర్చీలాక్కుని కూర్చున్నాడు గోపాలం. "మీరు వడించండి, నేనిప్పుడే వస్తాను" అంది రాధ. గోపాలానికి ఇష్టమైన తెల్లపట్టుచీర కట్టుకొచ్చింది.వస్తూనే "అదేవిటండీ. యింకా వడ్డించలేదా? అయ్యో కంచాలేవండీ?"అంది చెంబులకేసి చూస్తూ.

"అంతా అయిపోయింది, ఇక నువ్వు తినడమే తరవాయి" అన్నాడు గోపాలం. రాధ వచ్చి చూసింది. రెండు చెంబుల నిండా జావ ఉంది. ఏం చెయ్యాలో తెలీక నోట్లో బొటనవేలు పెట్టుకొనుంచుందిరాధ.

వంట పాడయినందుకు బాధ పడలేదు రాధ. తను రాసిన పద్యం భోజనాల తరువాత వినిపిద్దాం వనుకుంది, కానీ ఆ ఛాన్సు రాలేదే_బాధపడుతూ నుంచుంది.

రాధ బాధని చూడలేక శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు గోపాలం. ★